క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ బోల్తా



కమలాపూర్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్ కమలాపూర్ మండలం అంబాల–శ్రీరాములపల్లి జంక్షన్‌లో గురువారం ఉదయం బోల్తా పడింది. స్థానికుల కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా జమ్మికుంట, వీణవంక మండలాల్లోని మానేరు వాగు నుంచి నిత్యం పదుల సంఖ్యలో ఇసుకను ట్రాక్టర్ల ద్వారా కమలాపూర్ మండలం మీదుగా హనుమకొండకు తరలిస్తున్నారు. గురువారం సైతం ట్రాక్టర్ల ద్వారా హనుమకొండకు ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు కమలాపూర్ పోలీసులు అంబాల వద్ద ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుని డ్రైవర్ల ఫోన్లు లాక్కున్నారు. దీంతో కొందరు డ్రైవర్లు.. తప్పించుకుని ట్రాక్టర్లతో సహా అక్కడి నుంచి ఉడాయించారు. పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో ఓ డ్రైవర్ ట్రాక్టర్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడిపాడు. అంబాల–శ్రీరాములపల్లి జంక్షన్ మూలమలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. స్థానికులు, వాహనదారులు అప్రమత్తంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

మైనర్లే డ్రైవర్లు!

ఇసుక అక్రమ తరలింపు కోసం ట్రాక్టర్ యజమానులు మైనర్లను డ్రైవర్లుగా పెట్టుకుంటున్నారు. వారు అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతుండడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని వారు కోరుతున్నారు.

మూడు ట్రాక్టర్ల పట్టివేత

జమ్మికుంట మండలం విలాసాగర్ నుంచి హనుమకొండకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను కమలాపూర్ మండలం అంబాల వద్ద గురువారం పట్టుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. వారి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. వీణవంక మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన తాళ్లపల్లి శ్రీనివాస్, మునిగాల ప్రశాంత్, ఏదూరి రమేశ్‌ను అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సీఎం కప్ రెఫరీగా కృష్ణమూర్తి

కాజీపేట: హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరగనున్న సీఎం కప్ పోటీల రెఫరీగా కాజీపేట పట్టణానికి చెందిన మండలోజు కృష్ణమూర్తి ఎంపికయ్యారు. హనుమకొండ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న కృష్ణమూర్తిని ప్రభుత్వం రెఫరీగా ఎంపిక చేయడంపై ఎవర్‌గ్రీన్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు గురువారం హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను సన్మానించారు.

ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యుడిగా సుజిత్



విద్యారణ్యపురి: అఖిల భారత విద్యార్థి తెలంగాణ రాష్ట్ర కార్యసమితి సభ్యుడిగా హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఆరెపల్లి సుజిత్ ఎన్నికయ్యారు. సిద్దిపేటలో నిర్వహించిన ఏబీవీపీ రాష్ట్ర మహాసభలో ఎన్నుకున్నట్లు సుజిత్ గురువారం తెలిపారు.

ద్రవిడ ప్రజల పార్టీ డివిజన్ అధ్యక్షుడిగా ప్రణీత్

ఖిలా వరంగల్: తెలంగాణ ద్రవిడ ప్రజల పార్టీ 38వ డివిజన్ అధ్యక్షుడిగా మధ్యకోటకు చెందిన పూసాల ప్రణీత్ నియమితులయ్యారు. ఈమేరకు ప్రణీత్‌కు పార్టీ జిల్లా అధ్యక్షుడు పూసల శ్రీకాంత్ గురువారం నియామక పత్రం అందజేశారు.

ఇంటింటా ఇందిరమ్మ సర్వే

ఖిలా వరంగల్: ఇందిరమ్మ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని 35వ డివిజన్ కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ అన్నారు. వరంగల్ శివనగర్, ఏసీరెడ్డినగర్‌లో ఇందిరమ్మ సర్వే గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన కమిటీ ప్రతినిధులతో కలిసి సర్వేను పరిశీలించి మాట్లాడారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. సర్వే సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు పూర్తి సమాచారం తెలపాలని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాస్, రేణుకుంట్ల శివకుమార్, శ్రీరాంరాజేష్, బుక్క రాజు, మాధవి, సరస్వతి, ఇందిరమ్మ, రమేష్ పాల్గొన్నారు.

టీజీఓ నాయకుడి జన్మదిన వేడుకలు

హన్మకొండ అర్బన్: తెలంగాణ గెజిటెడ్ అసోసియేషన్ కేంద్ర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా సమన్వయకర్త అన్నమనేని జగన్‌మోహన్‌రావు జన్మదిన వేడుకలను గురువారం ఆయన నివాసంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. టీజీఓ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, కోల రాజేష్‌గౌడ్, ఎంపీడీఓలు పెద్ది ఆంజనేయులు, అనిల్‌కుమార్, ఎంపీఓలు రఘుపతిరెడ్డి, శ్రీనివాస్, సయ్యద్ హసన్, జనగామ సబ్ రిజిస్ట్రార్ అంజద్, రామ్‌చందర్‌రావు, కిరణ్‌కుమార్ గౌడ్, సీపీఓ శామ్యూల్ తదితరులు పాల్గొని జగన్‌మోహన్‌రావు దంపతులను గజమాలతో సత్కరించారు.

అధ్వానంగా హైవే

- తేలిన కంకర, గుంతలతో ఇబ్బందులు
- ప్రమాదాల బారినపడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



ఆత్మకూరులో ప్రమాదకరంగా మారిన హైవే



కంకర తేలిన ప్రధాన రహదారి



ధ్వంసమైన రహదారి

ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు గుడెప్పాడ్ జంక్షన్‌లో గల 163 జాతీయ రహదారి ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో పాటు కంకర తేలి అధ్వానంగా తయారైంది. దీంతో రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గుడెప్పాడ్ రోడ్డు విస్తరణ పనులు జరిగి కొంత కాలమే అయినప్పటికీ రోడ్డు పూర్తిగా పాడవడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. అలాగే మండల కేంద్రంలో పాతబస్టాండ్ వద్ద హైవే రోడ్డు మెత్తబడడంతో ద్విచక్రవాహనాలు స్కిడ్ అవుతూ కిందపడుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్–భూపాలపట్నానికి వెళ్లే ఈ హైవేలో ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి అధికారులు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. ఇటీవల పలువురు ప్రమాదాల బారిన పడి తీవ్రగాయాల పాలైన సంఘటనలు ఉన్నాయని స్థానికులు తెలిపారు. అనేక మంది ఉద్యోగులు, వ్యాపారస్తులు, చిరు వ్యాపారులు, విద్యార్థులు ఈ మార్గం గుండా బైక్‌లపై హనుమకొండకు అప్‌ఆండ్ డౌన్ చేస్తుంటారు. రోడ్డు బాగాలేకపోవడంతో వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. ఇదే రోడ్డు మార్గంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా ఉన్నతాధికారులు తరచూ ప్రయాణిస్తున్నప్పటికీ ఈ రోడ్డును పట్టించుకోవడం లేదని వాహనదారులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డును బాగుచేయాలని వాహనదారులు కోరుతున్నారు.

లక్ష్మీనృసింహుడికి స్వాతినక్షత్ర పూజలు



కల్యాణంలో మంగళ సూత్రాలను చూపుతున్న అర్చకులు



సుదర్శన నారసింహ హవన పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామంలో స్వయంభూగా వెలిసిన స్తంభ నారసింహుడికి, గర్భాలయంలోని లక్ష్మీనృసింహుడికి స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని గురువారం అభిషేకం, సుదర్శన నారసింహ హవనం, కల్యాణం జరిపించారు. అదే విధంగా ధనుర్మాసంలో 11వ రోజును పురస్కరించుకుని ఉదయం నిత్యపూజల అనంతరం గోదా, కృష్ణుల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి తిరుప్పావై సేవాకాలం మంగళశాసనం నిర్వహించారు. 11వ పాశురాన్ని అర్చకులు భక్తులతో విన్నపం చేయించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి స్తంభమూర్తి, గర్భాలయంలోని ధ్రువ మూర్తులు, ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అర్చకులు పంచసూక్తం పఠిస్తు విశేషంగా అభిషేకం జరిపించారు. తర్వాత అర్చకులు సుదర్శన నారసింహ హోమం వేదోక్తంగా నిర్వహించారు. లక్ష్మీ–నరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి–వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు కల్యాణం పాంచరాత్ర ఆగమానుసారం జరిపించారు. నీరాజన మంత్రపుష్పంతో పాటు నక్షత్ర హారతి సమర్పించారు. ఆచార్యులు వెంకటరత్నం, జయకృష్ణ, అరుణ్‌కుమార్, విక్రమ్ పాల్గొన్నారు.

కంచెలకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వొద్దు

- విద్యుశాఖ ఏఈ చందూలాల్



విద్యుత్ కనెక్షన్‌లు తొలగిస్తున్న సిబ్బంది

శాయంపేట : రైతులు సాగు చేస్తున్న పంటలకు అడవి పందుల బెడద నుంచి కాపాడుకునేందుకు పంటపొలాల చుట్టు విద్యుత్ కంచెలు ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్ ఇవ్వొద్దని విద్యుత్ శాఖ ఏఈ చందూలాల్ సూచించారు. గురువారం మండలంలోని 11 కేవీ విద్యుత్ వైర్లకు అక్రమ కనెక్షన్ వేసుకున్న వైర్లను సిబ్బందితో తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. రైతులు సాగుచేస్తున్న మొక్కజొన్న పంటలను అడవి పందుల బెడద నుంచి కాపాడుకునేందుకు పంట చుట్టు ఇనుప తీగలతో కంచె ఏర్పాటు చేసి 11 కేవీ విద్యుత్ వైర్ల నుంచి విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నారని, అడవి పందులు తాకగానే విద్యుత్ ప్రమాదంతో అవి మృతి చెందుతున్నాయని అన్నారు. వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని అన్నారు. అర్ధరాత్రి సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాత్రి వేళల్లో విద్యుత్ క్రమబద్ధీకరణకు వచ్చే సిబ్బంది కూడా ప్రమాదాల బారినపడుతారన్నారు. రైతులందరూ సహకరించి విద్యుత్ మెయిన్ తీగల నుంచి అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు తీసుకోవద్దని ఆయన కోరారు.

సంక్షిప్తంగా

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు అక్షయ ఎంపిక



దామెర : రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఊరుగొండ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ గురువారం తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని సూరబోయిన అక్షయ ఈ నెల 21న హనుమకొండలో జేఎన్ఎస్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంది. ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. కాగా, ఈ నెల 27 నుంచి 29 వరకు హనుమకొండలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని అక్షయను ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు డాక్టర్ రాచర్ల గణపతి, శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ సభ్యుడు రాజేందర్ తదితరులు అభినందించారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌లో గురువారం కరీంనగర్ ప్రతిమ ఫౌండేషన్ సహకారంతో హనుమకొండ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా పలువురు గుండె సంబంధిత రోగులకు ఈసీజీ, 2డీఎకో, ఎముకలకు సంబంధించిన రోగులకు ఎక్స్‌రే, మహిళలకు గైనిక్ పరీక్షలు నిర్వహించి మొత్తంగా సుమారు 400 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని కరీంనగర్‌లోని ప్రతిమ ఆస్పత్రికి తరలించారు. ప్రతిమ ఆస్పత్రి వైద్యులు, నిర్వాహకులు మోహన్‌రావు, రవీందర్, రఘు, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు తోట సురేష్, నాయకులు పాల్గొన్నారు.

బీసీ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా సంపత్



కమలాపూర్ : బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని భీంపల్లికి చెందిన బోయిని సంపత్‌ను నియమించినట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం నియామకపత్రాన్ని అందించారు. గ్రామగ్రామాన బీసీలను సంఘటితం చేస్తూ సంస్థాగతంగా నిర్మాణం చేసి ఉద్యమాన్ని బలోపేతం చేస్తామన్నారు. జనాభాలో 52 శాతం ఉన్న బీసీలు విద్య, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారని, బీసీలకు విద్య, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో జనాభా ప్రాతిపదికన వాటా కోసం, దేశ వ్యాప్త కుల గణన కోసం, బీసీ అట్రాసిటీ చట్టం కోసం నిరంతరం పోరాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుడికాల భాస్కర్, జిల్లా కన్వీనర్ చిలకమర్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంత్రి సీతక్క పరామర్శ



వేలేరు : ములుగు సీఐ వంగాపెల్లి శంకర్ తండ్రి మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క గురువారం వేలేరులోని శంకర్ స్వగృహానికి వచ్చి మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట ములుగు డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, వేలేరు మండల అధ్యక్షుడు కత్తి సంపత్, మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, మండల ఇన్‌చార్జ్ మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్, బిల్లా యాదగిరి, సద్దాం హుస్సేన్, లక్ష్మణ్ నాయక్, అమర్‌సింగ్, రాజమల్లయ్య, రణధీర్‌రెడ్డి, రాజేందర్, సలీంమాలీక్ ఉన్నారు.

వినతిపత్రం అందజేసిన కేజీబీవీ సిబ్బంది

తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బంది మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేసి తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వారి సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

ఎస్సైగా తిరుపతి

ఆత్మకూరు : ఎస్సైగా తిరుపతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు జనగాంలో విధులు నిర్వర్తించిన అతను ఆత్మకూరుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన పరమేశ్వర్ ఇటీవల శాయంపేటకు బదిలీపై వెళ్లారు. కాగా సీఐ సంతోశ్‌ను ఆయన మార్యదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు. అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సీఐ సంతోశ్ సూచించారు. ఎలాంటి సమస్య అయినా చట్టపరిధిలో పరిష్కరించాలని ఈ సందర్భంగా సూచించారు.

పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ తనిఖీ



రామన్నపేట: వరంగల్ మట్టెవాడ పోలీస్ స్టేషన్‌ను ఏసీపీ నందిరాంనాయక్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం చేయాలని సూచించారు. బాధితులతో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి, ఎస్సైలు విఠల్, నవీన్, సాంబన్న, లచ్చయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

వరంగల్ లీగల్: వరంగల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించనున్న తెలంగాణ అడ్వకేట్స్ ఇన్విటేషనల్ రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ వాల్‌పోస్టర్లను జిల్లాలో కోర్టు ప్రాంగణంలో వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలాగీతాంబ గురువారం ఆవిష్కరించారు.

గ్రామాల్లో కొనసాగిన సామాజిక తనిఖీ



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి

ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గురువారం 16వ ఈజీఎస్ సామాజిక తనిఖీ కొనసాగింది. మండల కేంద్రంలో ఆడిట్ బృందం క్షేత్రస్థాయి ఈజీఎస్ పనులను పరిశీలించింది. గ్రామసభలో 20 కుటుంబాలు ఉపాధి హామీ జాబ్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీలందరికీ పని కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ ప్రజావేదిక నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ రాజిరెడ్డి, ఎస్ఆర్‌పీ రమేశ్, డీఆర్‌పీ రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్వేత తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనే సీపీఐ లక్ష్యం



ఎల్కతుర్తి : కేక్ కట్‌చేస్తున్న శ్రీనివాస్‌రావు



శాయంపేట : జెండా ఆవిష్కరిస్తున్న భిక్షపతి



కమలాపూర్ : జెండా ఆవిష్కరిస్తున్న ఓదెలు



ధర్మసాగర్ : మాట్లాడుతున్న ఎల్లేష్

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు శ్రీనివాస్

ఎల్కతుర్తి : సమసమాజ స్థాపనే సీపీఐ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు ఆదారి శ్రీనివాస్ అన్నారు. పార్టీ వందేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా గురువారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో సీపీఐ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం కేక్‌కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమసమాజ స్థాపన కోసం సీపీఐ అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసిందన్నారు. పరిశ్రమలు, బ్యాంకులు ప్రభుత్వ రంగంలో ఉంటేనే పేద, మధ్యతరగతి కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు. పరిశ్రమలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉంటే కార్పొరేట్లకు ఊడిగం చేయాల్సి వస్తోందని, రిజర్వేషన్లు అమలు కావన్నారు. పేద వారికి నాణ్యమైన విద్య అందడంలేదని, డబ్బుంటేనే నాణ్యమైన విద్య అనే పరిస్థితి దాపురిస్తుందన్నారు. మావోయిస్టు పార్టీతో సహా అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఏకం కావాల్సిన సమయం వచ్చిందన్నారు. అప్పుడే పేద, మధ్యతరగతి వారికి మంచిరోజులు వస్తాయన్నారు. ప్రపంచం కమ్యూనిజం వైపు చూస్తుందన్నారు. పెట్టుబడిదారి పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ పేదల బాగు పట్టించుకోవని, కమ్యూనిస్టులు మాత్రమే పేదల పక్షాన పోరాటం చేస్తారన్నారు. యువతకు 8 గంటల ఉపాధి, కనీస వేతనం, ప్రజల హక్కుల కోసం పోరాటాలు, ఉద్యమాలు, బలిదానాలు చేసిన పార్టీ సీపీఐ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు సంపత్, రమేశ్, రామచంద్రారెడ్డి, సంజీవరెడ్డి, కృష్ణారెడ్డి, బాలరాజు, తిరుపతి, ఉప్పలయ్య, స్వరూప, రంజిత్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ : మండల కేంద్రంలో సీపీఐ శత వసంతాల వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి నకీర్త ఓదెలు సీపీఐ జెండాను ఆవిష్కరించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి జక్కు రాజుగౌడ్, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఇసంపెల్లి శంకర్, నాయకులు కొలుగూరి బాలరాజు, జేరిపోతుల లచ్చయ్య, మాట్ల మొగిలి తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : భారతదేశంలో 100 ఏళ్ల చరిత్ర కలిగిన ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి కొనియాడారు. గురువారం మండలంలోని పెద్దకోడెపాక రెవెన్యూ శివారు పరిధిలోని గుడిసెల ప్రాంతంలో మండల సమితి ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి జెండా ఆవిష్కరించారు. అనంతరం మండల కార్యదర్శి బత్తిని సదానందం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండల సహాయ కార్యదర్శి అశోక్, నాయకులు రాజేందర్, రమేశ్, అంకుశావలి, కళావతి, రమాదేవి పాల్గొన్నారు.

ధర్మసాగర్ : దోపిడీ పాలనపై పోరాటం చేసిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ అన్నారు. సీపీఐ వందేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా మండల కేంద్రంలో గురువారం గ్రామశాఖ కార్యదర్శి బాబు అధ్యక్షతన ఎర్రజెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వెంకటేష్, జిల్లా నాయకులు భిక్షపతి, శంకర్ నాయక్, దీన, బట్టు మల్లయ్య, ప్రభాకర్, కొమురయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

వెనక్కి వెళ్లిన నిధులు తీసుకొచ్చాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: అభివృద్ధి పనులను బీఆర్ఎస్ హయాంలో చేపట్టకపోవడంతో వెనక్కి వెళ్లిన స్మార్ట్ సిటీ నిధులను తిరిగి తీసుకొచ్చామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు అన్నారు. నగరంలోని 56వ డివిజన్‌లో సుమారు రూ.3.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులతో పాటు రూ.2.20కోట్ల ఖర్చుతో నిర్మించిన బ్రిడ్జిని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అభివృద్ధి వైపు దృష్టి సారించలేదని విమర్శించారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. జవహర్ కాలనీలో కమ్యూనిటీ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. దేవన్నపేటలో సుమారు రూ.4.60 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, మురుగునీటి కాల్వల పనులకు శంకుస్థాపన చేస్తానని పేర్కొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, దివ్యారాణి, మాజీ కార్పొరేటర్ రాజునాయక్, డివిజన్ అధ్యక్షుడు హరిబాబు, గడ్డం శివరాంప్రసాద్, మణీంధర్ నాథ్, సందెల చిన్న, జవహర్‌కాలనీ అధ్యక్షుడు సోమయ్య పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నా


నయీంనగర్: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించేందుకు తాను కట్టుబడి ఉన్నానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ –2024 ముగింపు కార్యక్రమం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన క్లబ్ ప్రహరీ నిర్మాణానికి వారు శంకుస్థాపన చేశారు.

రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్‌కు ధ్యాన్‌చంద్ క్లబ్ క్రీడాకారుల ఎంపిక



పరకాల : సీఎం కప్ రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్‌కు పట్టణానికి చెందిన ధ్యాన్‌చంద్ హాకీ క్లబ్ క్రీడాకారులు ఏడుగురు ఎంపికయ్యారు. హైదరాబాద్‌కు వెళ్లే ముందు హనుమకొండలో హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సోదా రామకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. టోర్నమెంట్‌లో ప్రతిభ కనబర్చి సీఎం కప్‌తో రావాలంటూ ఆయన ఆకాంక్షించారు. ధ్యాన్‌చంద్ హాకీ క్లబ్ టీం సభ్యులు రాకేష్, నరేష్, నాగార్జున, రత్నాకర్, క్రాంతి, నరసింహ ఉన్నారు.

వేసవి డిమాండ్‌కు అనుగుణంగా చర్యలు



హన్మకొండ: వేసవి డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరాకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్ఈ కె.వెంకటరమణ తెలిపారు. హనుమకొండ న్యూశాయంపేటలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 8 ఎంవీఏ ఉండగా అదనంగా మరో 8 ఎంవీఏ పెట్టడంతో 16 ఎంవీఏ వరకు సబ్‌స్టేషన్ సామర్థ్యం పెరిగిందని తెలిపారు. వేసవిలో ఎంత లోడ్ పెరిగినా దానిని తట్టుకునేలా సబ్‌స్టేషన్‌ను సిద్ధం చేసినట్లు తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని అవసరమైన ప్రణాళికలకు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి, ఏడీఈలు మల్లికార్జున్, జానకీ రాంరెడ్డి పాల్గొన్నారు.